# అన్నీ చేశాం.. మరిన్ని వరాలతో వస్తున్నాం

**బీఆర్ఎస్ మోసపూరిత వాగ్దానాలు చేయదు**

**తొమ్మిదేండ్ల అభివృద్ధి సంక్షేమాలే దానికి నిదర్శనం**

**వంచించేందుకు దొంగల ముఠాలు వస్తున్నాయి జాగ్రత్త**

**నామినేషన్ అనంతరం మంత్రి గంటకండ్ల జగదీశ్‌రెడ్డి**

సూర్యాపేట, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పార్టీ 2014, 2018లో జరిగిన ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చడంతో పాటు ఇయ్యని అనేక హామీలను అమలు చేసినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. అవన్నీ నేడు ప్రజలందరి కండ్ల ముందు కనిపిస్తున్నవని, ప్రజలకు మేలు చేయడం తప్పా బీఆర్ఎస్ ఏనాడూ మోసపూరిత వాగ్దానాలు చేయదని చెప్పారు. గురువారం బీఆర్ఎస్ సూర్యాపేట నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు అనంతరం భారీగా విచ్చేసిన ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. దశాబ్దాల తరబడి అధికారం వెలగబెట్టిన అభివృద్ధి నిరోధకులు మళ్లీ ఎన్నికలు వస్తున్నాయనగానే నేడు దొంగల్లా వస్తున్నారు.. ప్రజలు అప్రమత్తంగా ఉండి వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పింఛన్లు పెంచాం. మిషన్ భగీరథతో స్వచ్ఛమైన మంచినీటి సరఫరా జరుగుతున్నది. ప్రతి గల్లీలో రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశాం. రైతు రుణ మాఫీ చేశాం. జిల్లా కేంద్రంలో ట్యాంక్ బండ్ నిర్మాణాలు చేశాం. పార్కుల అభివృద్ధి జరిగింది. ప్రభుత్వ వైద్యాన్ని ఎవరూ ఊహించని రీతిన మెరుగుపరిచాం. 24 గంటల విద్యుత్ సరఫరా, గురుకుల విద్యాలయాల ఏర్పాటు, హామీ ఇవ్వకుండానే కేసీఆర్ కిట్లు, విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం, దేశంలోనే నంబర్ వన్ లాంటి మోడల్ మార్కెట్, రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల, రైతు బంధు, రైతు బీమా ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజలకు అవసరమైనవన్నీ చేసినట్లు తెలిపారు.

## దోపిడీదారులు వస్తున్నారు తస్మాత్ జాగ్రత్త..

తాను గెలిచిన తర్వాత గత తొమ్మిండ్లలో నియోజక వర్గం ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నట్లు మంత్రి తెలిపారు. అయితే మళ్లీ ఎన్నికలు రావడంతో గతంలో హత్యాకాండలు సృష్టించిన వారు, పార్టీలు మారే ఊసరవెల్లులు, దోపిడీదారులు ఓట్ల కోసం వస్తున్నారని వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి హితవు పలికారు. గతంలో మరో నియోజక వర్గంలో ఉన్న ఇద్దరు నేతలు ఏండ్ల తరబడి గ్రామాల్లో విధ్వంసాలు సృష్టించి హత్యాకాండలు చేయడంతో ఏ ఊరికి వెళ్లినా వీధుల్లో రెండు పక్కలా ఆ నేతల అనుచరుల గోరీలు దర్శనమిస్తున్నాయన్నారు. నేడు ఎన్నికల ప్రచారం కోసం వచ్చి ప్రజలకు ఏది చేస్తారో చెప్పకుండా మాకే ఓటు వేయాలని కోరుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు అప్రమత్తమై అంతా ఏకమై చీకటి దొంగల పని పట్టాలని కోరారు. బీఆర్ఎస్ మన పార్టీ.. మన ఇంటి పార్టీ. మన అందరి రక్షణ కోసం వచ్చిన పార్టీ. అది కేసీఆర్ పార్టీ. గులాబీ జెండా పార్టీ. కారు గుర్తు పార్టీ అంటూ దానిని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పార్టీలాగా స్వాగతించి నవంబర్ 30న జరుగబోయే ఎన్నికల్లో మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని మంత్రి కోరారు. ఇప్పటికే సూర్యాపేటను రాష్ట్రంలోనే అభివృద్ధి చెందే తొలి మూడు, నాలుగు నియోజక వర్గాలతో పోటీ పడేలా చేసినట్లు మరోసారి గెలిపిస్తే ఎవరూ ఊహించని రీతిన సూర్యాపేటను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలుపనున్నట్లు పేర్కొన్నారు.

### మరింత సంతోష పడేలా వరాలు..

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన తమ ప్రభుత్వం వచ్చే ఐదేండ్ల పాటు ప్రజలు మరింత సంతోషంగా ఉండేందుకు ఖచ్చితంగా చేయబోయే పనులను మ్యానిఫెస్టో రూపంలో ప్రజల ముందు ఉంచినట్లు మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచిన పింఛన్‌తో పింఛన్‌దారుల బాధలు తీరాయని, వారు సంతోషంగా ఉండేలా మరింత పెంచి రూ.5వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు చేయబోతున్నట్లు చెప్పారు. అలాగే తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి కేవలం రూ.400కే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం, రైతు బంధు ఎకరాకు రూ.16 వేలు, కేసీఆర్ బీమాతో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా, సౌభాగ్యలక్ష్మి పథకంతో అర్హులైన పేద మహిళలకు నెలకు రూ.3 వేల భృతి, అగ్రవర్ణ పేదల కోసం గురుకులాలు తదతరాలు పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు.



నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి దంపతులు

### స్వచ్ఛందంగా.. వేలాదిగా

సూర్యాపేట, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట నియోజకవర్గ నుంచి వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాట్రిక్ విజయం కోసం ముచ్చటగా మూడోసారి గురువారం నాడు నామినేషన్ వేశారు. అయితే ఈసారి నియోజక వర్గం నుంచి కనీవిని ఎరుగని రీతిన నామినేషన్ కార్యక్రమానికి జనం తండోపతండాలుగా స్వచ్ఛందంగా తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడి కోసం సూర్యాపేట పట్టణంతో పాటు సూర్యాపేట, చివ్వెంల, ఆత్మకూర్.ఎస్, పెన్‌పహాడ్ మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులతో పాటు వేలాదిగా ప్రజలు తరలి రావడంతో పట్టణంలోని వీధులన్నీ కిటకిటలాడాయి. ఎస్‌వీ డిగ్రీ కళాశాల నుంచి పీఎస్ఆర్ సెంటర్, వెంకటేశ్వరస్వామి దేవాలయం రోడ్డు, ఖమ్మం తదితర రోడ్లపైకి దాదాపు 50 వేల మందికి పైనే చేరుకోవడంతో దురాజ్‌పల్లి జాతరను తలపించేలా నామినేషన్ కార్యక్రమం మారింది. ఇంతటి జనాన్ని చూస్తుంటే జగదీశ్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం పక్కా అని బీఆర్ఎస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### పలు ఆలయాల్లో మంత్రి పూజలు

సూర్యాపేట టౌన్/ఆత్మకూర్.ఎస్ : బీఆర్ఎస్ సూర్యాపేట నియోజక వర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలుకు ముందు మంత్రి జగదీశ్‌రెడ్డి ఆనవాయితీగా తమ కుటుంబానికి సెంటిమెంట్‌గా వస్తున్న పలు ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. ముందుగా ఆత్మకూర్ (ఎస్) మండలంలోని నెమ్మికల్ దండుమైసమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత నకిరేకల్ నియోజక వర్గంలోని పాలెం గ్రామంలో గల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంతో పూజలు నిర్వహించి ముడుపుల చెల్లించుకుని స్వామివారి ఆశీర్వాదం పొందారు. అక్కడ నుంచి అర్వపల్లిలోని యోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి చేరుకుని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్‌తో కలిసి పూజలు నిర్వహించారు. అలాగే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని నివాసానికి చేరుకున్న మత పెద్దలు మంత్రి జగదీశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సర్వమత ప్రార్థనలు చేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా తన తండ్రి గుంటకండ్ల రాంచంద్రారెడ్డి, అక్కాబావలు కట్టా రేణుక- శేఖర్‌రెడ్డి, అన్నావదినలు గుంటకండ్ల రమేశ్‌రెడ్డి–మణిమాలలకు మంత్రి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం నియోజక వర్గం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి ర్యాలీగా వెళ్లి నామినేషన్ సమర్పించారు.



మెడికల్ కాలేజ్ నుంచి పీఎస్ఆర్ సెంటర్ వరకు సాగిన భారీ ర్యాలీ



ర్యాలీలో యాదవ పెద్ద ఆనంద హేళ



పీఎస్ఆర్ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# మంత్రి జగదీశ్‌రెడ్డికే మా మద్దతు

**• జిల్లా కేంద్రంలోని 45వ వార్డు ప్రజలు**

బొడ్రాయిబజార్, నవంబర్ 9 : ముచ్చటగా మూడోసారి మంత్రి జగదీశ్‌రెడ్డికే తమ మద్దతు అని బీఆర్ఎస్ కారు గుర్తుకే తమ ఓటు అని జిల్లా కేంద్రంలోని 45వ వార్డు ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. గురువారం సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌రెడ్డి నామినేషన్ ర్యాలీకి భారీగా తరలివెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సవరాల సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సూర్యాపేటను అభివృద్ధిలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డిని ముచ్చటగా మూడోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేసి జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బండారు రాజా, వార్డు అధ్యక్షుడు కుక్కడపు సాలయ్య, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు సయ్యద్ సలీం, నూకల వెంకట్‌రెడ్డి, రాచకొండ శ్రీను, గునగంటి సతీశ్, ఉప్పల సంపత్‌కుమార్, మిట్టపల్లి రమేశ్, బజ్జురి శ్రీనివాస్‌తో పాటు వార్డు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఆత్మకూర్.ఎస్ నుంచి..

ఆత్మకూర్.ఎస్ : బీఆర్ఎస్ సూర్యాపేట నియోజక వర్గ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి ఆత్మకూర్.ఎస్ మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. వారిలో పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ తంగళ్ల వీరారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోళ్ల వెంకట్‌రెడ్డి, తంగెళ్ల మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మం, గునగంటి భిక్షం, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సూర్యాపేట రూరల్ : జిల్లా కేంద్రంలో మంత్రి నామినేషన్ ర్యాలీలో బిఆర్ఎస్ సూర్యాపేట మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, నార్ముల్ జిల్లా డైరెక్టర్ చల్లా సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

నాగారం : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కిశోర్ నామినేషన్ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఎంపీపీ కూరం మణీవెంకన్న, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, తిరుమలగిరి మార్కెట్ వైస్ చైర్మన్ రాంరెడ్డి, రైతు బంధు సమితి మండల కో ఆర్డినేటర్ గుండగాని అంబయ్య, జిల్లా సభ్యుడు పొదిల రమేశ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎర్ర యాదగిరి, ఈదుల కిరణ్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు బాలమల్లు, చంద్రమౌళి, సోమయ్య, అంజయ్య, శ్రీనివాస్, యాదగిరి, మహేందర్, అంజయ్య, అశోక్, లింగమల్లు ఉన్నారు.



సూర్యాపేటరూరల్ : ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ మండల నాయకులు



ఆత్మకూర్.ఎస్ నుంచి ర్యాలీకి బయల్దేరిన బీఆర్ఎస్ నాయకులు




బొడ్రాయిబజార్ : మంత్రి నామినేషన్ ర్యాలీకి తరలివెళ్తున్న 45వ వార్డు నాయకులు, కార్యకర్తలు